
కోతలు.. వాతలు!

వేసవి ఆరంభంలోనే వారికి విద్యుత్ వెతలు మొదలయ్యాయి. అప్రకటిత కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శరవేగంగా విస్తరిస్తున్న ఆ ప్రాంతాల్లో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా కాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో పవర్ కట్ చేస్తున్నారు. మరో వైపు సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల షార్ట్‌సర్క్యూట్ అయి ఇళ్లల్లో గృహోపకరణాలు దగ్ధమవుతున్నాయి.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. అయినా తమ వెతలను ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని అగనంపూడి, నిర్వాసిత కాలనీల వాసులు వాపోతున్నారు.


అగనంపూడిలోని ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్


విస్తరించిన అగనంపూడి కాలనీలు

పట్టాలు ఎక్కని సబ్‌స్టేషన్ డిమాండ్

అగనంపూడి సెక్టార్–1,2,3 నిర్వాసితకాలనీల అవసరార్థం ప్రత్యేకించి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయినా పట్టించుకోక పోవడంతో అవస్థలు పడుతున్నామని కొండయ్య వలస, దిబ్బపాలెం, దానబోయినపాలెం, పెద మడక, పినమడక, డొంకాడ కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మంగళపాలెంలో ఇటీవల ప్రారంభించిన టిడ్కో ఫీడర్

శరవేగంగా విస్తరిస్తున్న కాలనీలు

వినియోగానికి సరిపడా సరఫరా కాని విద్యుత్

వేసవి ఆరంభంలోనే మొదలైన విద్యుత్ వెతలు

అగనంపూడి: రెండు వార్డుల్లో విస్తరించిన ప్రాంతం అగనంపూడి. అందులో పదులో సంఖ్యలో నిర్వాసిత కాలనీలు ఉన్నాయి. 60 వేల పైచిలుకు జనాభా... 32 వేల మంది ఓటర్లు ఉన్నారు. 29వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మరో వైపు కాలనీలు విస్తరిస్తున్నాయి. అయితే తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఆర్ఈసీఎస్ అగనంపూడి సెక్షన్ కార్యాలయం పరిధిలో అగనంపూడి, దువ్వాడ, ఫార్మాసిటీ నిర్వాసితకాలనీలతో పాటు జేఎన్ఎన్‌యూఆర్ఎం, హుద్ హుద్ కాలనీ, రాజీవ్ స్వగృహ సముదాయంతో పాటు గాజువాక శివారు గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 29వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గతంలో దువ్వాడ వీఎస్ఈజెడ్ 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కేబీఆర్ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగేది. అగనంపూడి, దువ్వాడకు నలు దిశలా బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు శరవేగంగా విస్తరిస్తుండడంతో వినియోగానికి తగిన విధంగా విద్యుత్ సరఫరా జరగడం లేదు. సామర్థ్యానికి మించి వినియోగం జరుగుతుండడంతో ఓవర్ లోడ్ రిలీఫ్ కోసం ఎప్పటికప్పుడు విద్యుత్ కోతలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆరేళ్ల కిందట అగనంపూడిలో ఇండోర్ సబ్‌స్టేషన్‌తో పాటు మంగళపాలెంలో ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అయినా అగనంపూడి సెక్టార్–1, 2 నిర్వాసితకాలనీల్లోని వినియోగానికి సరిపడా విద్యుత్ సరఫరా జరగడం లేదు. దీంతో ఓవర్‌లోడ్ రిలీఫ్ పేరుతో తరచూ అప్రకటితకోతలు తప్పడం లేదు. మరో వైపు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో ఇళ్లల్లో గృహోపకరణాలు దెబ్బతింటున్నాయి.

వినియోగానికి సరిపడా సరఫరా చేయాలి



అగనంపూడి, దువ్వాడ పరిధిలో విద్యుత్ వినియోగం పెరిగింది. విద్యుత్ కనెక్షన్లు రెట్టింపు అయ్యాయి. వీటికి తోడు అగనంపూడి చుట్టూ కొత్త కాలనీలు, బహుళ అంతస్తులు పెరిగిపోతున్నాయి. ఈ కారణంగా వినియోగం నాలుగింతలు పెరిగింది. విద్యుత్ ఉన్నతాధికారులు అగనంపూడి ఇండోర్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా జరిగే విద్యుత్‌ను అగనంపూడిలో విస్తరించిన ప్రాంతానికి వినియోగిస్తే కొంతమేరకు సమస్య తగ్గుతుంది.

– కరణం పైడిరాజు, కర్ణవానిపాలెం

ప్రత్యేక సబ్‌స్టేషన్ అవసరం



అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ వినియోగం పెరిగింది. గతంలో 107 గజాల ఇంటి స్థలంలో రెండు గదుల ఇల్లు మాత్రమే ఉండేది. ఇప్పుడు రెండు నుంచి మూడు అంతస్తుల నిర్మాణాలు సాగుతున్నాయి. ఒక్కో ఫ్లాట్‌లో రెండు నుంచి మూడు విద్యుత్ కనెక్షన్లు ఉంటున్నాయి. ఈ కారణంగా వినియోగం పెరిగింది. అగనంపూడి చుట్టూ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నా, నిర్వాసితకాలనీల అవసరాలకు సరిపడా విద్యుత్ సరఫరా జరగడం లేదు. అధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే నిర్వాసితకాలనీల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి.

– మడగల నరసింగరావు, పెదమడక

వేసవిలో ఇబ్బందులు పడుతున్నాం



మార్చి నెలాఖరు నుంచే అప్రకటిత కోతలు మొదలయ్యాయి. దీంతో చంటి పిల్లలతో ఇబ్బందులు పడుతున్నాయి. ఒక వేళ విద్యుత్ ఉన్నా కొన్ని సందర్భాల్లో హెచ్చు తగ్గుల వల్ల విద్యుత్ ఉపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

గోపిశెట్టి పద్మ, కొండయ్యవలస

చినఅప్పారావు సేవలు మరువలేం


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: గాజువాక వర్తక సంఘం అధ్యక్షుడిగా తిప్పల చినఅప్పారావు 40 ఏళ్ల పాటు అందించిన సేవలు మరువలేమని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డి, గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ఆటోనగర్ వర్కర్స్‌యూనియన్ ప్రధాన కార్యదర్శి గొందేశి పెదరెడ్డి ఆధ్వర్యంలో తిప్పల నితీష్‌రెడ్డి అధ్యక్షతన పెదగంట్యాడ కలాసీ భవనంలో తిప్పల చినఅప్పారావు ఐదో వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చినఅప్పారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, నాయకులు మంత్రి హరి, వాసు, దల్లి అప్పలరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, చుక్కా శ్రీను, వివిధ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తిరుమల నగర్‌వాసులు

కూర్మన్నపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్ పై బుధవారం 87వ వార్డు తిరుమలనగర్‌లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. తడిపొడిచెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, భూగర్భజలాల పరిరక్షణకు కృషి చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు పరమానందం, విశ్వేశ్వరరావు,సన్యాసిరావు, రామరాజు,సురేంద్రనాథ్, రామరాజు,వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.3,10,000 జరిమానా

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పరిధిలో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 31 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చారు. 3వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రెండో కోర్టు జడ్జి మురళీ కృష్ణ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మొత్తం 31 కేసులకు గాను రూ.3,10,000 ఫైన్ వసూలు చేసినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: టెక్ మహీంద్ర సహకారంతో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి క్యాంపస్‌లో పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండి, ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులకు హెల్త్ కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో 3 నెలలు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లమో పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న శిష్ట కరణ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: క్యాన్సర్‌తో బాధపడుతున్న అగనంపూడికి చెందిన జగ్గమంత్రి శ్రీనివాసరావును బుధవారం కూర్మన్నపాలెం శిష్టకరణ అసోసియేషన్ ప్రతినిధులు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.శ్రీనివాసరావును ఆదుకోడానికి మిగిలిన అసోసియేషన్ ప్రతినిధులు ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో కూర్మన్నపాలెం అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి.వి.ఎన్.మూర్తి, కార్యదర్శి డి.సత్యారావు, మాజీ అధ్యక్షుడు పీఎస్‌వీఎన్ గోపాల్, జె.రమేష్, మహిళా అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సీ' ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు



ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం(సీ) ఉపాధ్యక్షుడిగా 'సీ' సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి. శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు ఉపాధ్యక్షుడిగా ఉన్న చంద్ర వెంకటేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. బుధవారం జరిగిన సీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కమిటీని ఎన్నుకునే వరకు శ్రీనివాసరావు ఈ పదవిలో కొనసాగుతారని సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ భారతి, ఇతర వైద్యులు

అగనంపూడి: సుఖ ప్రసవాలు జరిగేందుకు గర్భిణులు సహకారం అందివ్వాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. ఏరియా ఆస్పత్రిలో బుధవారం ప్రత్యేక గర్భిణుల ఓపీ కౌంటర్ల వద్ద సిజేరియన్ వద్దు–సాధారణ ప్రసవాలు ముద్దు అంటూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ గర్భిణులు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాయామం, తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించా రు. అప్పుడే సాధారణ డెలివరీలకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ పి.ఉష, డాక్టర్ కణితి పద్మజ, డాక్టర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ శిక్షణ ప్రారంభం


స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జీఎం మధుసూదనరావు

ఉక్కునగరం: ఉక్కు కనిష్ఠ అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్)లో బుధవారం స్విమ్మింగ్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఏటా వేసవిలో ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజల సౌకర్యార్థం స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ కోచింగ్ ఇస్తుంటారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం, క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఎం. మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్ నేర్చుకోవడం ప్రతీ ఒక్కరికీ అవసరమన్నారు. ఈత వల్ల శారీరక వ్యాయామంతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ మాట్లాడుతూ క్లబ్ సభ్యులు కాని వారు కూడా క్యాంప్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ప్రతీ రోజు సాయంత్రం రెండు బ్యాచ్‌లవారీగా శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి వేణుగోపాల్, జె. రమేష్, వెంకటరాజు, భువన కిరణ్, ఎ. రంగనాథం, బి.వి. రమణ, వి.ఎస్.బి. రాజు, ఎ. ఆది రమేష్, కె.ఎల్. నరసింహం, ఎం. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక.. ఆత్మీయ వేడుక


ఆత్మీయ కలయికలో గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల1975-76 బ్యాచ్ విద్యార్థులు

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.. ఆత్మీయ ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975–76లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గాజువాక బీసీరోడ్డు ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు.. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. 50 ఏళ్లకు కలవడం మరుపురాని జ్ఞాపకం అని సంతోషం వ్యక్తం చేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.మధురజ్ఞాపకాలతో తిరుగు పయణమయ్యారు.కార్యక్రమంలో గానాల బ్రహ్మం, ఉడా వెంకట శ్రీనివాసరావు, బోయి పెరిరెడ్డి, ఈశ్వరరావు, జిలకర్ర రమణ, కుంచారావు, వై. తాతారావు, దేవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉక్కు ఉద్యోగి మృతి

అవయవదానానికి అంగీకారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1 విభాగంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విభాగ సీనియర్ ఫోర్‌మెన్ ఎం. శ్రీనివాసరావు(55) బుధవారం రాత్రి మృతి చెందారు. అయితే కుటుంబ సభ్యులు మరికొందరికి పునర్జన్మ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. శ్రీనివాసరావు అవయవాలను దానం చేయడానికి అంగీకారం తెలిపారు.దీంతో ఆస్పత్రి వైద్యులు అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. నగరంలోని సీతమ్మధారలో నివసిస్తున్న శ్రీనివాసరావు మార్చి 30న నైట్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యారు. విధులు ముగించుకుని 31న ఉదయం 6.30 సమయంలో అవుట్ పంచ్ కొట్టి వెనుతిరగగా అక్కడ ఉన్న చెక్క తగులుకుని కింద పడ్డారు. ఈ సంఘటనలో అతను తీవ్రంగా గాయపడడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌సీ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24న మినీ బాలోత్సవం

దాబాగార్డెన్స్: ఆసరా చారిటబుల్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశాన్ని పురస్కరించుకుని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం నిర్వహించనున్నట్టు ఆసరా అధ్యక్షురాలు సి. సునీత తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మినీ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌తో కలిసి ఈ నెల 24న కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసరా గత మూడేళ్లుగా వీసీసీ ద్వారా నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్లు, క్లబ్ విద్యార్థులకు అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు. ఆయా సెంటర్ల ద్వారా రెగ్యులర్ చదవుతో పాటు ఏడాది పొడవునా వివిధ రకాల ఎక్స్‌ట్రా కరిక్యులం యాక్టివిటీస్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఆసరా వార్షిక సమావేశాన్ని పురస్కరించుకుని పిల్లల పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీసీసీ జిల్లా కన్వీనర్ కె. సుశీల మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు సబ్ జూనియర్స్‌గా, 3 నుంచి 5వ తరగతి పిల్లలు జూనియర్స్‌గా, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సీనియర్స్‌గా పరిగణించి ఈవెంట్స్ జరుగుతాయన్నారు. చిత్ర లేఖనం, కథ చెప్పడం, మెమరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృందగానం, జానపద బృంద నృత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాస రచన, క్విజ్ వివిధ కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 8309812422 నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసరా కమిటీ సభ్యుడు శ్రీనాథ్, వీసీసీ కో ఆర్డినేటర్ సతీష్, ఆర్గనైజర్లు కల్యాణి, భవానీ, మణి, రమాదేవి పాల్గొన్నారు.

'సెల్ టవర్‌కు అనుమతులు నిరాకరించాలి'

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వొద్దని స్థానిక ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జనావాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు చేయవద్దని సెల్ టవర్ యాజమాన్య ప్రతినిధులతో పాటు స్థల యజమానికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేద వివరించారు. సెల్ టవర్ వల్ల ఇబ్బందులు పడతామని అనుమతులు నిరాకరించేలా చొరవ తీసుకోవాలని నాయకులు బి.సత్యనారాయణ, ఎం.గోవిందరావు, నాగమణి, మహాలక్ష్మి వినతిపత్రంలో కోరారు.

'ప్రవాస సాహిత్యం' పుస్తకావిష్కరణ

సీతంపేట: ప్రవాస భారతీయుడు డాక్టర్ రమేష్ ప్రసాద్ రావెళ్ల (యూఎస్ఏ) రచించిన 'ప్రవాస సాహిత్యం' విమర్శనా వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ సభ బుధవారం సాయంత్రం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన సభలో విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఘండికోట రఘురామారావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 55 ఏళ్ల క్రితం విశాఖ నుంచి యూఎస్‌కు వెళ్లి ఉన్నత స్థానాలు అధిరోహించినా, తెలుగు భాష, సాహిత్యంపై రమేష్ ప్రసాద్ మక్కువ వదల్లేదని కొనియాడారు. అక్కడి ప్రపంచం, భాష, దృక్పథం వేరైనా అవేవీ తనపై ప్రభావం చూపలేదని, చక్కగా ప్రవాస సాహిత్యం పేరుతో విమర్శనాత్మక పుస్తకం రాయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ ఒక పేజీ రాయాలంటే వంద పేజీలు చదవాలని, ఈ పుస్తకం రాయడానికి రమేష్ ప్రసాద్ ఎన్ని పుస్తకాలు చదివారో ఇట్టే అర్థం అవుతుందన్నారు.

విద్యుత్ రంగం ప్రైవేటీకరణ తగదు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న విశాఖలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గల ఐదు జిల్లాల కార్మికులతో సదస్సు నిర్వహించనున్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న సదస్సుకు సంబంధించి బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేట్, కాంట్రాక్ట్, పీస్‌రేట్ కార్మికులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పీఆర్‌సీలో జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందర్నీ విద్యుత్ సంస్థలో విలీనం చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ చంద్రశేఖర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరశురామ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం


స్వామివారికి పూజలు చేస్తున్న గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి


స్వామివారి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే గురుమూర్తి రెడ్డి తదితరులు

కూర్మన్నపాలెం: కణితి ఆర్‌హెచ్ కాలనీలోని వేణుగోపాలస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వడ్లపూడి పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాస్, బొద్దగోవింద్,రమాదేవి, అప్పలకొండ, ఆలయ కమిటీ సభ్యులు ఈశ్వరరాజు, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు ప్రగడ శ్రీనివాసరావు, ఆడారి శ్రీను, పల్లా పెంటారావు, బొట్టారవి, డి. దానప్పలు, ప్రగడ వేణు పాల్గొన్నారు.

యూటీఎస్ యాప్‌పై అవగాహన


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ జనరల్ టికెట్స్ మొబైల్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు, ఈ యాప్ వినియోగించే వారికి 3 శాతం క్యాష్‌బ్యాక్ రాయితీ అందజేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో జనరల్ టికెట్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు, ఈ యాప్ ద్వారా ప్లాట్‌ఫాం టికెట్లు, జనరల్ టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్‌పై సాధారణ ప్రయాణికులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్లాట్‌ఫాంలపై మీడియా ద్వారా, పోస్టర్లు, పాంప్లెట్ల ద్వారా కూడా ప్రయాణికులకు తెలియజేస్తున్నారు. ఆర్–వ్యాలట్ రీచార్జి చేసుకుని, యూటీఎస్ అనే యాప్ ద్వారా సాధారణ రైలు టికెట్లు బుక్ చేసుకున్న వారికి 3 శాతం రాయితీ అందజేస్తున్నారు. ఈ రాయితీ 2025 ఆగస్టు 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఆండ్రాయిడ్, ఐవోఎస్, విండోస్ ఆపరేటింగ్ సిస్టం వాడుతున్న ప్రతి మొబైల్‌లో ఈ యాప్ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

యూటీఎస్ యాప్ ద్వారా ప్రయోజనాలు..

- సాధారణ టికెట్ల కోసం కౌంటర్ల వద్ద లైన్‌లో నిల్చోవాల్సిన అవసరం ఉండదు
- టికెట్ల కోసం చిల్లర ఇవ్వాలనే సమస్య ఉండదు
- ఎక్కడి నుండైనా టికెట్లు బుక్ చేసుకోవచ్చు
- అందరికీ వీలుగా వివిధ భాషల్లో సేవలు
- సులభతరమైన నగదు రహిత చెల్లింపులు

ప్రణాళిక ప్రకారం టీకాల కార్యక్రమం


యూపీహెచ్‌సీ రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

మహారాణిపేట: నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం రంగిరీజు వీధిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది, వైద్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది విధిగా ముఖ హాజరు వేయాలని, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.